జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | 31 | అక్టోబర్ | 2024 ◆ పేజీలు : 6

## దీపావళి శుభాకాంక్షలు : జిల్లా ఎస్పీ

**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి:**

జిల్లా ప్రజలకు,పోలీస్ అధికారులకు సిబ్బందికి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్.ఈ దీపావళి పండుగ ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఈ సందర్భంగా ఎస్పీ మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.టపాసులు పేల్చే సమయంలో తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.





### సాంఘిక,ఆర్థిక, రాజకీయ
# కులగణన సర్వే

**ఉపాధ్యాయులు పాల్గొనాలి..**
**ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సంఘాలకు పిలుపు**

**టేకులపల్లి, అక్టోబర్30, ప్రజాజ్యోతి :**

తెలంగాణ ప్రభుత్వం చేపట్టనున్న సాంఘిక, ఆర్థిక, రాజకీయ కుల గణన సర్వేలో ఉపాధ్యాయులు పాల్గొనాల్సిందిగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఉపాధ్యాయ సంఘాల నేతలకు ఇచ్చారు. అందుకు అన్ని ఉపాధ్యాయ సంఘాలు సహకరిస్తామని అన్నారు.ఈ యొక్క సర్వేను పాఠశాల పని దినాలలో అయితే ఉదయం పూట లేదా నవంబర్ 9, 10, 15, 16, 17 సెలవు దినాలలో కుల గణన సర్వే చేపట్టేలా చర్యలు

మిగతా 2 లో...



### సంస్కృతికి ప్రతిబింబం...
# దీపావళి పండుగ

-ఈ పండుగ వెనుక కథ!
-నేడు దీపావళి

4 లో..

దీపావళి అంటే ఉత్సవాలు దీపాలు, అలంకరణలు, కొనుగోళ్లు, టపాకాయలు, పూజలు, ప్రార్థనలు, బహుమతులు, ఫలహారాలు భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా వెలుగొందేవి భారతీయ పండుగలు.వాటిలో ఆనంద ఉత్సాహాలతో జాతి, కుల, మత, వర్గ విభేదాలను విస్మరించి సమైక్యంగా జరుపుకునే పండుగే దివ్య దీప్తుల దీపావళి. జగతిని జాగృతం చేసే చైతన్య దీప్తుల శోభావళి.

◆ ఇల్లందు, ప్రజాజ్యోతి

# గంజాయి పట్టివేత..

### రెండు ఆటోలు స్వాధీనం, ఇద్దరు వ్యక్తుల అరెస్టు, పరారీ లో ఒకరు



**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి:**

ఒరిస్సా కలిమెల నుంచి హైదరాబాద్ కు ఆటోలో అక్రమంగా తరలి వెళ్తున్న గంజాయిని బుధవారం ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఒరిస్సా కలిమెళ్ళ నుంచి హైదరాబాద్ కు రెండు ఆటోలో గంజాయి వెళుతుందని సమాచారం మేరకు, ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్

మిగతా 2 లో...

### నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన
# ఇద్దరు ఏరియా కమిటీ సభ్యుల లొంగుబాటు

**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి:**

తెలంగాణ రాష్ట్ర మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు ఏరియా కమిటీ సభ్యులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు ఎదుట బుధవారం స్వచ్ఛందంగా లొంగిపోవడం జరిగింది. లొంగిపోయిన మావోయిస్టు పార్టీ సభ్యుల వివరములు సోడి పొజ్జి (చిలుక)దోకుపాడు, కిష్టారం, సుక్మా జిల్లా చత్తీస్గడ్ రాష్ట్రం చెందిన వ్యక్తి. మడివి సోమిడి (రమ్మ) దోకుపాడు, కిష్టారం, సుకుమా జిల్లా, చత్తీస్గడ్ రాష్ట్రం. ఏరియా కమిటీ సభ్యురాలు అయిన సోడి పొజ్జి (చిలుక) నిషేధ సిపిఎం మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం- అల్లూరి సీతారామరాజు(బికె -ఎఎస్ఆర్ ) డివిజన్లోని చర్ల ఎల్ ఓ ఎస్ కమాండర్ గా పనిచేస్తుందని తన సోదరుడైన సోడి జోగయ్య ప్రోత్సాహంతో 2017 వ సంవత్సరంలో చర్ల నందు ధళసభ్యురాలిగా చేరి 2021లో ఏరియా కమిటీ మెంబర్ గా ప్రమోషన్ పొంది ఆ తర్వాత 2023 వరకు నిషేధిత సిపిఎం

మిగతా 2 లో...



## 118 కేజీల గంజాయి పట్టివేత..

(మొదటి పేజీ తరువాయి...)

అండ్ ఎక్సైజ్ పోలీసులు కలిసి ఆర్టీవో చెక్పోస్ట్ వద్ద తనిఖీలు చేపట్టారు. అనుమానంగా వచ్చినటువంటి రెండు ఆటల్లో తనిఖీలు నిర్వహించగా అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. గంజాయిని వేయగా 118 కేజీలుగా ఉన్నట్లు ఎక్సైజ్ పోలీసులు నిర్ధారించారు. గంజాయి తో పాటు రెండు ఆటో లను ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. మరో వ్యక్తి పరారయ్యాడని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. పట్టుకున్న గంజాయి, వాహనాల విలువ కలిపి రూ. 31.50 లక్షలు గా ఉంటుందని ఎక్సైజ్ సూపర్ డెంట్ కరమ్ చందు తెలిపారు. అరెస్టు కాబడిన వ్యక్తుల్లో హైదరాబాద్ కు చెందిన కనిగల స్వాతిక్, మణుగూరు కు చెందిన గుంజు ఆమోస్ ను అరెస్టు చేయగా, సపా వత్ వెంకన్న పరారీ లో ఉన్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్.ఐ గౌతమ్ సిబ్బంది రామకృష్ణ గౌడ్, హాబీబ్ పాషా, వెంకట నారాయణ, గురవయ్య, సుమంత్, శ్రావణి, రమేష్ పాల్గొన్నారు. గంజాయిని పట్టుకున్నటువంటి టీమును ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్ రెడ్డి, ఎక్సైజ్ సూపరిడెంటు జనార్ధన్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ గణేష్, ఎక్సైజ్ సూపర్డెంట్ జానయ్య అభినందించారు.

## నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు ఏరియా కమిటీ సభ్యుల లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి...)

మావోయిస్టు పార్టీకి చెందిన చైతన్య నాట్య మండలి (సియన్ఎం) కమాండర్ గా పని చేసి చర్ల కమాండర్ గా పనిచేసిన మడకం ఎర్రయ్య రాజేష్ 2023లో మరణించిన తర్వాత ఆ భాద్యతలను ఈమె తీసుకుందని జిల్లా ఎస్పి రోహిత్ రాజు తెలిపారు. అదే విధంగా ఏరియా కమిటీ సభ్యురాలయిన మడవి సోమిడి (రమ్య) 2019లో చర్ల మిలిషియా కమాండర్ అయిన సోడి జోగయ్య (లేటు) ఆధ్వర్యంలో నిషేధిత మావోయిస్టు పార్టీలో చేరిందని 2021లో మణుగూరు కు ఈమెను బదిలీ చేశారని అనంతరం 2024 మే నెలలో ఏరియా కమిటీ మెంబర్ గా ప్రమోషన్ పొంది ముణుగూరు ఏరియాకు కమాండర్ గా ఇప్పటి వరకు పని చేసిందన్నారు. ఈ ఇద్దరు నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ దళ సభ్యులుగా చేరి ఏరియా కమిటీ సభ్యులుగా ప్రమోషన్ పొంది, ఇప్పటివరకు ఒకరు చర్ల కమాండర్ గా, మరోకరు మణుగూరు ఏరియాకు కమాండర్ గా పనిచేశారన్నారు. వీరి ఒక్కొక్కరిపై నాలుగు లక్షల రివార్డు ఉందన్నారు. జిల్లా పోలీసులు ఏర్పాటుచేసిన ఆపరేషన్ చేయూత కార్యక్రమం మంచి సత్ఫలితాలనిస్తుందని. జిల్లా పోలీసులు లొంగిపోయిన వారికి అందవలసిన ప్రతిఫలాలను సత్వరమే అందిచడం ద్వారా మిగిలిన మావోయిస్టు పార్టీ ధళసభ్యులు, నాయకులు కూడా ఆకర్షితులై పోలీసులు ఎదుట లొంగిపోవడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగానే వీరిద్దరూ జనజీవన స్రవంతిలో కలిసి సాధారణ జీవితాన్ని గడపాలని నిర్ణయించుకుని లొంగిపోవడం జరిగిందన్నారు. bలొంగిపోయి సాధారణ జీవనం గడపాలనుకునే దళ సభ్యులు వారి కుటుంబ సభ్యుల ద్వారా గానీ, స్వయంగా గానీ తమ దగ్గరలోని పోలీస్ స్టేషన్లో లేదా జిల్లా ఉన్నతాధికారుల వద్ద గానీ సంప్రదించగలరని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. లొంగిపోయే దళసభ్యులకు జీవనోపాధి, పునరావాసం కల్పించడం కోసం ప్రభుత్వం తరపున అందవలసిన అన్ని రకాల ప్రతిఫలాలను అందించడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం కృషి చేస్తుందన్నారు.

## సాంఘిక, ఆర్థిక, రాజకీయ కులగణన సర్వే...

(మొదటి పేజీ తరువాయి...)

తీసుకొని సర్వే చేసినందుకు సీసీఎల్ఎస్ గౌరవ వేతనం చెల్లించాలని టీఎస్ ఏటీఎఫ్ పక్షాన కోరడం జరిగింది. ఉపాధ్యాయులకు రాలవాల్సిన డి.ఎ, జిపిఎఫ్, టిఎస్జిఎల్ఐ, ఈఎల్ఎస్ వంటి ఇతర పెండింగ్ బిల్లుల చెల్లింపులు తక్షణమే చెల్లించాలని కోరడం జరిగింది. జీఓ నెంబర్ 3 కి చట్టబద్ధత కల్పించాలని, అందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డీఎస్సీ 2008 అన్సక్సెస్ఫుల్ లిస్ట్ లో ఉన్న ఉపాధ్యాయుల పేర్లను తొలగించి నెక్స్ట్ ఆర్డర్ ఆఫ్ మెరిట్ లో ఉన్న అభ్యర్థులతో కూడిన జాబితాను విడుదల చేయాలని ఆదివాసీ పోడు భూములకు సాగునీరు పట్టాలు ఇవ్వాలని, అటవీ శాఖ అధికారులు మొక్కలు పెట్టిన పోడు భూములు ఆదివాసీలకు ఇప్పించాలని కోరడం జరిగింది. ఇంకా ఏజన్సీ ప్రాంతంలోని ఆదివాసీ గిరిజన సమస్యలతో కూడిన వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది. త్వరలోనే మంత్రులతో కూడిన సబ్ కమిటీ కి ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యలు సమస్యలు అన్నీ చెప్పడానికి ఇంకా సమయం ఇస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఏటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కబ్బాకుల రవి, రాష్ట్ర కోశాధికారి ఉండం నాగేందర్ రావు, భద్రాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి చాపల రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## దీపావళిని ప్రజలు ఆనందంగా జరుపుకోవాలి-ఐటీడీఏ పీవో రాహుల్



**భద్రాచలం, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి:** సంస్కృతికి ప్రతిబింబంగా జరుపుకునే దీపావళి పండుగను ప్రజలందరూ ఆనందంగా జరుపుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ బుధవారం కోరారు. జాతి, కుల, మత, వర్గ విబేధాలను విస్మరించి సమైక్యంగా జరుపుకునే పండుగ దీపావళి పండుగ అని ఈ పండుగను ఏజెన్సీలో ప్రాంతంలో ప్రజలందరూ ఆనందంగా జరుపుకోవాలని కోరారు. చీకటిని పారద్రోలి వెలుగులు తెచ్చే పండుగ దీపావళి పండుగను యువత, చిన్నారులు ఎంతో ఉత్సాహంగా నిర్వహించుకోవాలన్నారు. ఐటీడీఏ పరిధిలోని అధికారులు, ప్రజలకు ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

## పెరిగిన టిప్పర్ డ్రైవర్ల వేతనాలు

**ఐ ఎఫ్ టి యు నాయకులు తోడేటి నాగేశ్వరరావు...**




**టేకులపల్లి, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి:** కే ఓ సి నుండి బిపిఎల్, నవభారత్, తడికలపూడి ఇంకా వివిధ ప్రాంతాలకు టిప్పర్ల ద్వారా బొగ్గు సరఫరా చేస్తున్న డ్రైవర్లకు వేతనాలు పెరిగాయని తెలంగాణ ప్రగతిశీల మోటార్ మరియు ఆటో వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోడేటి నాగేశ్వరరావు ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు డి. ప్రసాద్ మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి. రామ్మోహన్ రావు తెలిపారు. బుధవారం కోయగూడెం టిప్పర్ డ్రైవర్లతో టేకులపల్లి లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మికులు సమిష్టిగా. సంఘటితంగా ఉద్యమించడం మూలాన వేతనాలు పెంచుకోగలిగామని వారు అన్నారు. గత జీతం మాస్టర్ కు 550 రూపాయలు ఉండగా నేడు 610 రూపాయలకు పెంచుకున్నా మని అన్నారు. బేటా 150 రూపాయలు ఉండగా 180 రూపాయలుగా ట్రిప్పు మామూలు 130 నుండి 150...230 నుండి 270 పెంచుకున్నా మని అన్నారు. షెడ్డు మాములు గతంలో 500 రూపాయలు ఉండగా దానిని 600 రూపాయలకు పెంచుకున్నట్లు వారు తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతభత్యాలు డ్రైవర్లకు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్లీనరు లేనట్లయితే క్లీనర్ జీతము సగము డ్రైవర్ కు ఇచ్చే విధంగా ఒప్పందం జరిగినట్లు వారు అన్నారు. ఈ ఒప్పందం 29 -- 2024 నుండి 28- 10- 2025 వరకు అనగా సంవత్సరం వరకు అగ్రిమెంట్ కాలంగా నిర్ణయించినట్లు వారు తెలిపారు. ఈ ఒప్పందంలో టిప్పర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కోరం సురేందర్ అసోసియేషన్ అధ్యక్షులు నరసింహారావు. వెంకట్ బాలకృష్ణ మోహన్ పాల్గొనగా ఐఎఫ్టియు నాయకులు తోడేటి నాగేశ్వరరావు కొక్కు సారంగపాణి డి ప్రసాద్ డి. మోహన్ రావు ఎండి. రాసుద్దీన్. మల్లికార్జునరావు. ఏఐటీయూసీ నాయకులు దేవర కొండ శంకర్ ఐ ఎన్ టి యు సి నాయకులు ఎస్ కే యాకుబ్ అలీ తదితరులు పాల్గొన్నారు. ఈ ఒప్పందాన్ని టిప్పర్ వానర్లు అమలు చేయాలని కోరారు. ఈ జనరల్ బాడీ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు డ్రైవర్లు. నాయకులు. భద్రం. సమ్మయ్య ముతేష్. నాగేందర్. రవి, మధు. సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ నర్సిరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ పోస్టర్ ఆవిష్కరణ

**భద్రాచలం, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి:** వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా నర్సిరెడ్డిని గెలిపించాలని యుటీఎఫ్ నాయకులు కోరారు. బుధవారం స్థానిక అంబేద్కర్ సెంటర్ లో గల వెన్నెల హాస్పిటల్లో నర్సిరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి విజయ్ కుమార్ మాట్లాడుతూ అర్హత కలిగిన ఉపాధ్యాయులందరూ ఓటు నమోదు చేసుకోని మొదటి (1) ప్రాధాన్యత ఓటు నర్సిరెడ్డి కి వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ కార్యాలయ కన్వీనర్ టీవీఎస్ ప్రసాద్, సీనియర్ నాయకులు ఏ వెంకటేశ్వర్లు, రాజ శ్రీనివాస్, దుమ్ముగూడెం ప్రధాన కార్యదర్శి సంగం శ్రీనివాస్, బూర్గంపాడు ప్రధాన కార్యదర్శి టి. రమేష్, భద్రాచలం అధ్యక్షులు ఎం రమేష్ చంద్, తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ పార్టీ కమిటీలు రద్దు

**నవంబర్ 4న కొత్త నాయకత్వం ప్రకటిస్తాం**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావు**



**భద్రాచలం, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి:** భద్రాచలం నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ సంబంధించి అన్ని కమిటీలను రద్దు చేస్తున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు బుధవారం ప్రకటించారు. కార్తీకమాసం తొ సోమవారం 4వ తేదీన భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం మండలాలకు చెందినఅన్ని కమిటీలను మండల నాయకుల సమన్వయంతో ఏకగ్రీవంగా ప్రకటించడం జరుగుతుందని స్పష్టం చేశారు. పార్టీని గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని పార్టీ కమిటీలను, అనుబంధ సంఘాల కమిటీలను పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టి బీఆర్ఎస్ పార్టీకి పూర్వవైభవం తీసుకువస్తామన్నారు. జిల్లాకు ఈశాన్య ఉన్న భద్రాచలం నియోజకవర్గం నుంచి పార్టీ కమిటీలను చేపట్టి భవిష్యత్లో ప్రతిపక్ష పార్టీగా కేసీఆర్ నాయకత్వంలో ప్రజాపోరాటాల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 420 హామీలను అమలుచేసే వరకు పార్టీని సమన్వయంతో ఏకతాటిపై నడిపించి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాలను ఎండగట్టి ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించేలా ప్రజలను సిద్ధం చేస్తామన్నారు. ప్రజలను చైతన్య పరిచి ఈ ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో దోషిగా నిలబెడతామన్నారు.

## నియోజకవర్గానికి నిధులివ్వండి

**– సీఎం రేవంత్ రెడ్డిని కోరిన ఎమ్మెల్యే పాయం**



**పినపాక, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి:** పినపాక నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని హైదరాబాద్ గాంధీభవన్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం సీఎంని కలిసిన ఎమ్మెల్యే పాయం ముందుగా భద్రాచలం సీతారామ చంద్రస్వామి లడ్డూ ప్రసాదాలు అందజేశి దీపావళి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. అనంతరం పినపాక నియోజకవర్గ ప్రధాన పనులకు, పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తూ పులుసుబొంత ప్రాజెక్టు, రేగుల గండి గ్రావిటీ కెనాల్, సీతారామ ప్రాజెక్టు లింకు కెనాల్, మారెళ్ళ పాడు గ్రావిటీ కెనాల్, పేరంటాల చెరువు తూముల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మెమోరాండం అందజేశారు. ఎమ్మెల్యే పాయం విజ్ఞప్తులను విన్న సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి త్వరలో నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎంకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నియోజకవర్గ ప్రజల తరుపున ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ గౌడ్ ను మర్యాద పూర్వకంగా కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్ర ప్రజలపై రూ.18,500 కోట్ల

# విద్యుత్ భారాన్ని ఆపడం సంతోషకరం





**ఇల్లందు, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి:**

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల పైన వేయాలనుకున్న రూ.18,500 విద్యుత్ చార్జీల భారాన్ని బిఆర్ఎస్ పార్టీ ఆపడం సంతోషకరమని మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్, మాజీ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్ లు పేర్కొన్నారు. బుధవారం ఇల్లందులో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపు మేరకు స్థానిక జగదాంబ సెంటర్ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈఆర్సి ప్రజల నుంచి వచ్చిన తీవ్రమైన వ్యతిరేకత, ప్రజాభిప్రాయ సేకరణలను ప్రధాన ప్రతిపక్షంగా వినిపించిన వాదనలను పరిగణలోకి తీసుకొని ప్రజల పైన భారీ విద్యుత్ భారాన్ని మోపకుండ ప్రభుత్వాన్ని నియంత్రించిన భారత రాష్ట్ర సమితి పార్టీ పని తీరు గొప్పదన్నారు. పది సంవత్సరాల్లో ఏనాడూ విద్యుత్ చార్జీలు పెంచని బిఆర్ఎస్ ప్రభుత్వానికి భిన్నంగా కేవలం 10 నెలల్లో పు రూ. 18,500 కోట్ల రూపాయల విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనలను రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తే, ప్రధాన ప్రతిపక్షంగా వాటిని వ్యతిరేకించాలని పబ్లిక్ హియరింగ్ లో పాల్గొని ఈఆర్సిని ఒప్పించగలిగామని కేటీఆర్ అన్నారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్ర నుంచి మొదలుకొని ఇప్పటిదాకా ప్రధాన ప్రతిపక్షం యొక్క వాదనలోని సహేతుకతను, న్యాయాన్ని విని సంపూర్ణంగా చార్జీల పెంపు ప్రతిపాదనలను ఈఆర్సి తిరస్కరించడం ఇదే మొదటిసారి అన్నారు. ఇప్పుడే కాదు భవిష్యత్తులో కూడా ప్రజలను ఇబ్బంది పెట్టే విధంగా తీసుకుని నిర్ణయాల పట్ల ఎప్పటికైనా మా బిఆర్ఎస్ ఈ విధంగానే పనిచేస్తుందని ప్రధాన ప్రతిపక్షంగా మా వాదనలను ఎప్పుడు వినిపిస్తూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ జెకె శ్రీనివాస్, నాయకులు సిలివేరి సత్య నారాయణ, లకావత్ దేవిలాల్ నాయక్, పరుచూరి వెంకటేశ్వర్లు, శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుక, దాస్యం ప్రమోద్, అజ్మీర బావు సింగ్ నాయక్, ఎండి జబ్బార్, గిన్నారపు రాజేష్, సాతాల హరికృష్ణ, రాచపల్లి శీను, నారపాక వసంతరావు, కాసాని హరిప్రసాద్ యాదవ్, సామల రవి తేజ, సంద ప్రవీణ్, కడకంచి వీర స్వామి, చాంద్ పాషా, గడ్డి శ్రీను, కిషన్ పాసి, లలిత్ పాసి, రామ్ లాల్ పాసి, సనా రాజేష్, సర్దార్, మునిగంటి శివ, ఇమ్రాన్, ఘాజి, యలమద్ది రవి, దేరంగుల పోశం, నీలం రాజశేఖర్, అజ్మీర కవిత, భూక్యా సురేష్, మంచాల జాన్ బాబు, భూకే దేవిల, ఉపేందర్ రావు, సర్వేష్, నెమలి ధనలక్ష్మి, కొక్కు సరిత, గంద్రతి చంద్రావతి, బానోత్ మంగ, వంగుడోత్ మల్సూర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మణుగూరులో 83 శాతం బొగ్గు ఉత్పత్తి

**– ఏరియా జీఎం దుర్గం రామచందర్**

**పినపాక, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి**




అక్టోబర్ మాసంలో 83 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించామని మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ తెలిపారు. బుధవారం జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అక్టోబర్ నెల ఏరియా ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. నిర్ణయించిన 11.16 లక్షల టన్నుల బొగ్గు లక్ష్యానికి 9.30 లక్షల టన్నుల బొగ్గుని వెలికితీసి 83 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించామని తెలిపారు. అలాగే ఏప్రిల్ 1 నుండి అక్టోబర్ 30 వరకు నిర్దేశించిన 69.81 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 61.26 లక్షల టన్నులు సాధించి 88 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించామని పేర్కొన్నారు. అదేవిధంగా 9.22 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేశామని తెలిపారు. అంతేకాకుండా అక్టోబర్ నెలలో ప్రోగ్రెసీవ్ గా 61.19 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేశామన్నారు. అలాగే ఓవర్ బర్డెన్ డిపార్ట్మెంటల్ గా 15 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి 13.05 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబి వెలికితీసి 87 శాతం సాధించామని తెలియజేశారు. ఏప్రిల్ 2024 నుండి అక్టోబర్ నెల వరకు ప్రోగ్రెసివ్ గా 96 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి 71.44 లక్షల క్యూబిక్ మీటర్లు ఓబి వెలికి తీసి 74 శాతం సాధించామన్నారు. సున్నా హాజరు ఉన్న కార్మికులను డ్యూటీలకు హాజరయ్యే విధంగా కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. ఈ సమావేశంలో డి. శ్యాంసుందర్ (ఎస్ ఓ టు జియం), డి. వెంకటేశ్వర్లు (ఏజీఎం సివిల్), ఎస్.రమేష్ (డీజీఎం పర్సనల్), కె. వెంకటరావు (డీజీఎం (ఐ.ఈ), ఎం.అనురాధ (డీజీఎం (ఎఫ్&ఏ), శేషగిరిరావు (మెడికల్ సూపరింటెండెంట్), కె. శ్రీనివాస్ (ఏరియా సెక్యూరిటి అధికారి), సింగు శ్రీనివాస్ (సీనియర్ పర్సనల్ అధికారి) తదితరులు పాల్గొన్నారు.

## ఎపిజివి బ్యాంకులో ఘర్షణ ...

### స్టేషన్ చేరిన పంచాయితీ.... హైడ్రామా అనంతరం ఇరువర్గాల రాజీ..

**ములకలపల్లి, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి:**

ఎపిజివి ములకలపల్లి బ్యాంకులో బుధవారం ఓ ఖాతా విషయంలో బ్యాంకు అధికారులకు అధికార పార్టీ నాయకులకు ఘర్షణ చోటుచేసుకున్నట్లు సమాచారం. ఘర్షణలో బ్యాంకు అధికారులపై దాడి జరిగినట్లు సైతం ఆరోపణలు వినిపిస్తున్నాయి. గొడవ జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఇరువర్గాలను పోలీస్ స్టేషన్ కు తరలించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు హైడ్రామా అనంతరం ఇరువర్గాలు ఫిర్యాదులు లేకుండా రాజీ కుదుర్చుకున్నారని, ఈ వ్యవహారంలో అధికార పార్టీ నాయకులే అంత నడిపినట్టు బహిరంగ చర్చ నడుస్తోంది. బ్యాంకు ఉన్నతాధికారులు సైతం బ్యాంకును సందర్శించినా, ఏ అధికారి కూడా ఈ విషయమై నోరుమెదపక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయమై స్థానిక ఎస్సై కిన్నెర రాజశేఖర్ ను వివరణ కోరగా ఎపిజివి బ్యాంకులో గొడవ జరుగుతుందని డయల్ 100 కు కాల్ రావడంతో వెంటనే స్పందించి ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను స్టేషన్ కు పిలిపించగా, ఇరువర్గాలు రాజీ చేసుకున్నట్లు తెలిపారని, ఇరువర్గాల నుంచి ఎలాంటి పిర్యాదు అందలేదని ఎస్సై తెలిపారు.



## కార్మికుల ప్రతీకల ఏర్పాటుకు స్థల పరిశీలన




**ఇల్లందు, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి:**

21 ఇంక్లైన్ గనిలో ఆవరణలో గల కార్మికుల ప్రతీకల ఏర్పాటుకు అనువైన స్థలాన్ని బుధవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఏరియా జియం జాన్ ఆనంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సింగరేణి సంస్థలోని కార్మిక పని విధివిధానాలను కనభరిచేలా విగ్రహాలను రూపొందించి ఇల్లందు పట్టణంలోని అనువైన ప్రదేశం పరిశీలించడం జరిగిందన్నారు. సుభాష్ నగర్ గ్రామపంచాయతీ ప్రధాన రోడ్డులోని డివైడర్ పై ఆయా విగ్రహాలను ఏర్పాటు చేసి, సింగరేణి సంస్థ సంస్కృతి, వారసత్వాన్ని ప్రతిభింబించాలని ఆకాంక్షించారు. త్వరలోనే ప్రతికల ప్రతిష్టాపన జరుగుతుందని జియం తెలిపారు. అదే విధంగా బొగ్గుకు పుట్టినిల్లయిన ఇల్లందు ఏరియా ఖ్యాతిని అందరికీ తెలియజేసేలా విగ్రహల ప్రతిష్ట చేసేందుకు కృషి చేస్తున్న జియం జాన్ ఆనంద్ ను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా ప్రతికలకు అవసరమైన అనుమతులు త్వరితగతిన ఇవ్వాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిజియం (పర్సనల్) జివి. మోహన్ రావు, ప్రాతినిధ్య సంఘ ఉపాధ్యక్షుడు జె. వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బండారు నాగేశ్వరరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు రుణమాఫీ

### పిఎసిఎస్ సంఘంలో ఒకే కుటుంబ సభ్యులకి రుణ మాఫీ



**టేకులపల్లి, అక్టోబర్30, ప్రజాజ్యోతి:**

మండలంలోని బేతంపూడి పిఎసిఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్ రావు చేతుల మీదుగా సంఘంలో సభ్యత్వం ఉన్న ఒకే కుటుంబానికి చెందిన నలుగురు రైతులకు రుణమాఫీ అందించారు. అనంతరం రుణమాఫీ గల రైతులకు తిరిగి రుణాలను పిఎసిఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్రావు అందించారు. ఈ కార్యక్రమంలో బేతంపూడి పి ఎస్ సి ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రియదర్శిని జాబ్ మేళాకు విశేష స్పందన



**కొత్తగూడెం, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి:**

కొత్తగూడెం ప్రియదర్శిని కళాశాలలో 'జెన్ ప్యాక్ట్' సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాకు మంచి స్పందన లభించింది. 2021-22 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల్లో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో బీకాం, బీఎస్సీ, బీసీఏతో పాటు బీటెక్ పూర్తిచేసిన విద్యార్థులు సుమారు 448 మంది రిజిస్టర్ అయ్యారు. ఈ మేరకు జెన్ప్యాక్ట్ కంపెనీ అధికారులు మూడు రౌండ్ల లో పరీక్షలు నిర్వహించి ఇంటర్వ్యూలో 32 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వారికి అనంతరం నియామక పత్రాలు అందజేసినట్లు ప్రియదర్శిని కళాశా లల చైర్మన్ డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు తెలిపారు. సంస్థ ప్రతినిధులు, ఎంపికైన వారికి డైరెక్టర్ చలపతిరావు, ప్రిన్సిపల్ నయింపాషా శుభాకాంక్షలు తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ రాయల వివేక్, ప్లేస్మెంట్ ఆఫీసర్ వెంకట ఫణి , పీడీ కాశిమల్ల రమేష్, ఢీకొండ దుష్యంత్ కుమార్ అధ్యాపకులు పాల్గొన్నారు.

# స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేసేంత వరకూ పోరాడతాం

– ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రాంచరణ్




**పాల్వంచ రూరల్, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి:**

ప్రభుత్వం స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేసేంత వరకూ పోరాడతామని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రాంచరణ్ అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ పాల్వంచ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మండల గిద్ధావర్ రవికుమార్ కు విద్యారంగ సమస్యల పై వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రామ్ చరణ్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్నరూ.8 వేల కోట్ల స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ, పీజీ, ఇంటర్మీడియట్, పారామెడికల్ కళాశాల యాజమాన్యాలు స్వయంగా కళాశాల బంద్ పెట్టి ఆందోళన చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం నిద్రపోతుందా అని ప్రశ్నించారు. పేద మధ్యతరగత విద్యార్థులకు అందించే స్కాలర్షిప్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని అన్నారు. ప్రైవేట్ కళాశాలలో చదువులు పూర్తిచేసుకుని పై చదువులకు పోవాలంటే స్కాలర్షిప్ ఫీజు, ఫీజ రియంబర్స్మెంట్ రాలేదు ఫీజు కట్టి సర్టిఫికెట్లు తీసుకోవాలని చెప్పేసి యాజమాన్యాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లు విద్యార్థులకు ఇబ్బందులు పెట్టడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో మార్పు రావాలి అంటే కాంగ్రెస్ రావాలి అని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదమధ్యతరగతి కుటుంబాల బతుకులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పక్షాన ఆలోచించి పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని లేని పక్షంలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను కూడ గట్టి బలమైన ఉద్యమాలు నిర్మించి ప్రభుత్వం మీద బలమైన విద్యార్థి ఉద్యమాలు నిర్వహిస్తామని అన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడితే విద్యార్థులు తలుచుకుంటే ప్రభుత్వ పునాదులు కదులుతాయని విద్యార్థులతో పెట్టుకున్న ప్రభుత్వాలు బతికి బట్ట కట్టలేదన్న చరిత్రను కాంగ్రెస్ ప్రభుత్వం మర్చిపోవద్దు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మందా నాగకృష్ణ, పాల్వంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల నాయకులు నాగబాబు, అఖిల్, సమీర, సుభద్ర, లక్ష్మి ప్రసన్న, సుమంత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు

## కే. ఓ.సి మైన్ నీళ్లతో చెరువులు నింపారా..?

**రైతుల పొలాలకు నీళ్లు అందించాలి.**

**సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు సురేష్ నాయక్ డిమాండ్**



**టేకులపల్లి, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి**

మండలంలోని కే ఓ సి మైన్లో ఊట నీళ్లతో పరిసర గ్రామాల్లో ఉన్న చెరువులు అన్ని నింపాలని సేవాలాల్ సేన ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ డిమాండ్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఓపెన్ కాస్ట్ వల్ల పరిసర గ్రామాలలో ఉన్న చెరువు లోని నీళ్లు త్వరగా అడుగున చేరుతున్నాయని దానివల్ల రైతులు ఆయా చెరువుల కింద వేసుకున్న వరి పొలంలోని పంట పండకుండా చివరి దశకు వచ్చి నీళ్లు లేక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు రైతులు కష్టపడి వరి పంటను మొదటి దశ నుంచి కాపాడుకుంటూ వస్తూ పెట్టుబడులు ఆ పంటలకు పెడుతూ చివరి దశకు వచ్చి చెరువులో నీళ్లు అడుగున చేరడం వలన ఆ వరి పంట ఎండిపోతున్నాయని రైతులు నష్టపోతా ఉన్నారని ఆరోపించారు. కాబట్టి తెల్లవాగు చెరువు – జెత్య తండా, చంద్రయ్య చెరువు – రావులపాడు, గడ్డి చెరువు – లచ్చగూడెం, చాకలి ఒర్రె –సుక్కాల బోడు, వాటి కింద సుమారు 1500 ఎకరాలు వరి పొలాన్ని రైతులు పండిస్తున్నారు. ఓసి ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజన ప్రజలే మధ్యలోనే కోయగూడెం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ బాంబు పేలుళ్ల వల్ల వేసిన వరి పొలం ఎండిపోతున్నది అని వారు ఆరోపించారు.దీనివలన ఆయా గ్రామాలలో ఉన్న గిరిజన ప్రజలు ఇబ్బందులు పడతా ఉన్నారు కాబట్టి తక్షణమే కోయగూడెం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి చొరవ చూపించి చెరువులను నింపి రైతులకు వారి వరి పంటకు నీళ్లు అందించాలని డిమాండ్ చేశారు.పరిసర గ్రామాలలోని చెరువుల ద్వారా నీళ్లు అందక ఎండిపోయిన వరి పంటలకు టేకులపల్లి కోయగూడెం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ ద్వారా రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు..



# సంస్కృతికి ప్రతిబింబం... దీపావళి పండుగ

## -ఈ పండుగ వెనుక కథ! -నేడు దీపావళి పండుగ

**ఇల్లందు, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి:**

దీపావళి అంటే ఉత్సవాలు దీపాలు, అలంకరణలు, కొనుగోళ్లు, టపాకాయలు, పూజలు, ప్రార్థనలు, బహుమతులు, ఫలహారాలు భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా వెలుగొందేవి భారతీయ పండుగలు. వాటిలో ఆనంద ఉత్సాహాలతో జాతి, కుల, మత, వర్గ విభేదాలను విస్మరించి సమైక్యంగా జరుపుకునే పండుగే దివ్యదీప్తుల దీపావళి. జగతిని జాగృతం చేసే చైతన్య దీప్తుల శోభావళి. నరకాసురుడనే రాక్షసుడిని సంహరించిన మరుసటి రోజు అతడి పీడ వదిలిన ఆనందంలో ప్రజలు దీపావళి చేసుకుంటారని పురాణాలు చెబుతున్నాయి. అలాగే లంకలోని రావణుడిని సంహరించి శ్రీరాముడు సతీసమేతంగా అయోధ్యకు తిరిగి వచ్చినపుడు కూడా ప్రజలు ఆనందోత్సవాల మధ్య దీపావళిని జరుపుకున్నారని రామాయణం చెపుతోంది. చీకటిని పారదోలుతూ వెలుగులు తెచ్చే పండుగగా విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటారు. దీప మాళికల శోభతో వెలుగొందే గృహాంగణాలు, ఆనంద కోలాహలంతో వెల్లివిరిసే ఆబాల గోపాలం, నూతన వస్త్రాల రెపరెపలు, పిండివంటల ఘుమఘుమలు, బాణసంచా చప్పుళ్ళు, ఈ దివ్య దీపావళి సోయగాలు. ఈ పండుగ ప్రతియేటా ఆశ్వయుజ అమావాస్య రోజున వస్తుంది. దీపాల పండుగకు ముందు రోజు ఆశ్వయుజ బహుళ చతుర్థశి. దీన్ని నరక చతుర్థశిగా జరుపుకుంటారు.

### దీపాలంకరణ, లక్ష్మీ పూజ

దీపజ్యోతిని పరబ్రహ్మ స్వరూపంగా, మనోవికాసానికి, ఆనందానికి, నవ్వులకు, సజ్జనత్వానికి, సద్గుణ సంపత్తికి నిదర్శనంగా భావిస్తారు. మహిళామణులంతా ఆశ్వీయుజ బహుళ చతుర్దశి నుండి కార్తీక మాసమంతా సంధ్యాసమయంలో మట్టిప్రమిదలలో దీపాలను వెలిగిస్తారు. చివరకు ఈ దీపాలను ముత్తయిదువులు కార్తీక పౌర్ణమికి సముద్ర స్నానాలను ఆచరించి జీవనదులలో వదులుతారు. ఇవి సౌభాగ్యానికి, సౌశీల్యానికి, సౌజన్యానికి ప్రతీకలుగా భావిస్తారు. ఈ దీపావళి శరదృతువులో రావడం చేత విశేషం. మనోనిశ్చలతకు, సుఖశాంతులకు అనువైన కాలమిది. దీపాల పండుగ అయిన దీపావళి రోజున మహాలక్ష్మి పూజను జరుపుకోవడానికి ఓ విశిష్టత ఉంది. పూర్వం దుర్వాస మహర్షి ఒకమారు దేవేంద్రుని ఆతిథ్యానికి వచ్చి ఒక మహిమాన్వితమైన హారాన్ని ప్రసాదించాడు. ఇంద్రుడు దానిని తిరస్కార భావముతో తన వద్దనున్న ఐరావతం అను ఏనుగు మెడలో వెస్తాడు అది ఆ హారాన్ని కాలితో తొక్కివేస్తుంది. అది చూచిన దుర్వాసనుడు ఆగ్రహము చెంది దేవేంద్రుని శపిస్తాడు. తత్ఫలితంగా దేవేంద్రుడు రాజ్యమును కోల్పోయి సర్వసంపదలు పోగొట్టుకుని దిక్కుతోచక శ్రీహరిని ప్రార్థిస్తాడు. ఈ పరిస్థితిని గమనించిన శ్రీ మహావిష్ణువు దేవేంద్రుని ఒక జ్యోతిని వెలిగించి దానిని శ్రీ మహాలక్ష్మీ స్వరూపంగా తలచి పూజించమని సూచిస్తాడు. దానికి తృప్తి చెందిన లక్ష్మీదేవి అనుగ్రహంతో తిరిగి త్రిలోకాధిపత్యాన్ని, సర్వసంపదలను పొందాడని పురాణాలు చెబుతున్నాయి. ఆ సమయంలో శ్రీ మహావిష్ణువు చెంతనే ఉండే మహాలక్ష్మీదేవిని ఇంద్రుడు ఇలా ప్రశ్నించాడు. తల్లి నీవు కేవలం శ్రీహరి వద్దనే ఉండటం న్యాయమా? నీ భక్తులను కరుణించవా? అంటాడు. దీనికి ఆ మాత సమాధానమిస్తూ త్రిలోకాధిపతీ "నన్ను త్రికరణ శుద్ధిగా ఆరాధించే భక్తులకు వారి వారి అభీష్టాలకు అనుగుణంగా మహర్షులకు మోక్షలక్ష్మీ రూపంగా విజయాన్ని కోరే వారికి విజయలక్ష్మీగా, విద్యార్థులు నన్ను ఆరాధిస్తే విద్యాలక్ష్మీగా, ఐశ్వర్యాన్ని కోరి ఆరాధించేవారికి ధనలక్ష్మీగా వారి సమస్త కోరికలు నెరవేర్చే వరలక్ష్మీదేవిగా ప్రసన్నురాలిని అవుతాను అని సమాధానమిచ్చింది. అందుచేత దీపావళి రోజున మహాలక్ష్మిని పూజించేవారికి సర్వసంపదలు చేకూరుతాయని విశ్వాసం.

### నరక చతుర్దశి

కృష్ణుడు, సత్యభామ కలిసి నరకాసురడి సైన్యాలతో పోరాడుతారు. ఆశ్వయుజ బహుళ చతుర్దశి నరక చతుర్దశిగా ప్రసిద్ధి పొందింది. నరకాసురుడనే రాక్షసుడు చెలరేగి సాధు జనాలను పీడిస్తూ దేవ, మర్త్య లోకాలలో సంక్షోభాన్ని కలిగిస్తుంటాడు. కృతయుగంలో హిరణ్యాక్షుని వధించిన వరాహస్వామికి భూదేవికి అసుర సంధ్యాసమయంలో జన్మిస్తాడు నరకుడు. అతడు లోక కంటకుడైనా మహావిష్ణువు వధించరాదని తల్లియైన తన చేతిలోనే మరణించేలా వరం పొందుతుంది భూదేవి. మహావిష్ణువు ద్వాపర యుగంలో శ్రీకృష్ణ భగవానునిగా అవతరించినప్పుడు భూదేవి సత్యభామగా జన్మిస్తుంది. అప్పటికి నరకాసురుడు లోక కంటకుడై చేస్తున్న అధర్మకృత్యాలను అరికట్టడానికి సత్యభామా సమేతంగా తరలి వెళ్తాడు శ్రీకృష్ణుడు. వారి మధ్య జరిగిన భీకర సంగ్రామంలో భూదేవి అంశ అయిన సత్యభామ శరాఘాతాలకు మరణిస్తాడు నరకుడు. తన పుత్రుని పేరైనా కలకాలం నిలిచి ఉండేలా చేయమని సత్యభామ ప్రార్థించడంతో ఆ రోజు నరక చతుర్థశిగా పిలువబడుతుందని వరం ప్రసాదిస్తాడు శ్రీకృష్ణుడు. నరకుని చెరనుండి సాధుజనులు, పదహారువేలమంది రాజకన్యలు విడిపించబడ్డారు ధర్మం సుప్రతిష్ఠమైంది. నరకాసురుని పీడ విరగడైందన్న సంతోషంతో ఆ మరుసటి రోజు ప్రజలు సంబరాలు జరుపుకుంటారు. ఈ సంబరాలు జరుపుకునే రోజు అమవాస్య కావడంతో చీకటిని పారద్రోలుతూ దీపాలతో తోరణాలు వెలిగించి బాణాసంచా కాల్చి వేడుక చేసుకున్నారు. కాలక్రమంలో అదే దీపావళి పర్వదినంగా మారింది. దీపావళి పండుగ రావడం వెనుక ఎన్నో కథలు ఉన్నాయని మన పురాణాలు చెపుతున్నాయి. ముఖ్యంగా రామాయణం, భారతం మరియు భాగవతాలను చదివితే మీకు ఆ కథలు తెలుస్తాయి. రామాయణం గురించి మీరు వినే ఉంటారు. అయోధ్యకు రాజు అయిన తండ్రి దశరధుని కోరిక మేరకు శ్రీరాముడు, సీతాలక్ష్మణ సమేతుడై పద్నాలుగేళ్ళు అడవిలో నివసించేందుకు వెళతాడు. వనవాసం చేస్తుండగా లంకాధీశుడైన పదితలల రావణాసురుడు సీతను ఎత్తుకు వెళతాడు. ఆ తర్వాత రావణసురునితో జరిపిన యుద్ధంలో విజయం పొందిన శ్రీరామచంద్రుడు సతీసమేతంగా అయోధ్యకు విచ్చేస్తాడు. ఆరోజు అమావాస్య అయోధ్య అంతా చీకట్లతో నిండి ఉంటుంది. దాంతో శ్రీరామునికి స్వాగతం పలికేందుకు అయోధ్యావాసులు దీపాలను వెలిగించి అమావాస్య చీకట్లను పారద్రోలుతారు. ఆనాటి నుంచి దీపావళి పండుగను మనం జరుపుకుంటున్నాం.

**ఇక రెండవ కథగా** నరకాసుర సంహారాన్ని తెలుసుకుందాం. ప్రాద్యోషపురానికి రాజు నరకాసురుడు. బ్రహ్మదేవుని నుంచి పొందిన వరగర్వంతో నరకాసురుడు దేవతలను మహర్షులను నానా ఇబ్బందులు పెడుతుంటాడు. నరకాసురుని ఆగడాలు శృతిమించడంతో సత్యభామ సమేతుడైన శ్రీకృష్ణుడు నరకాసురుని సంహరిస్తాడు. నరకాసురుని పీడ విరగడవ్వడంతో ప్రజలు దీపాలు వెలిగించి పండుగను జరుపుకున్నారు. ఆ పరంపర నేటికీ కొనసాగుతున్నది.

**మూడవ కథగా** పాల సముద్రం నుంచి శ్రీమహాలక్ష్మి దేవి ఉద్భవించిన వృత్తాంతాన్ని తెలుసుకుందాం. మరణాన్ని దరి చేరని అమృతం కోసం దేవ, దానవులు పాల సముద్రాన్ని చిలుకుతుండగా ఈ రోజు లక్ష్మిదేవి ఉద్భవించింది. సకల అష్టైశ్వర్యాలను ప్రసాదించే లక్ష్మీదేవికి దీపావళి నాటి సాయంత్రం హిందువులు ప్రత్యేక పూజలు చేస్తారు.

**నాలుగవ కథగా** భారతంలోని ఇతివృత్తాన్ని చెప్పుకుందాం. కౌరవులు సాగించిన మాయా జూదంలో ఓడిన పాండవులు పదమూడేళ్ళు వనవాసం ఒక సంవత్సర కాలం అజ్ఞాత వాసం సాగించి తమ రాజ్యానికి తిరిగి వస్తారు. ఆ సందర్భంగా ప్రజలు దీపాలు వెలిగించి వారికి స్వాగతం పలుకుతారు.

**ఐదవ వృత్తాంతంగా** రైతుల గురించి తెలుసుకుందాం. గ్రామీణ ప్రాంతాలలో పంట చేతికి వచ్చే సందర్భాన్ని పురస్కరించుకుని అన్నదాతలు దీపావళి పండుగను చేసుకుంటారు. మంచి పంట దిగుబడిని అందించినందుకు ఇష్టదైవానికి కృతజ్ఞతగా ప్రత్యేక పూజలు చేసి పండుగ జరుపుకుంటారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో దీపావళి పండుగను జరుపుకోవాలని ఆశీద్దాం.

# లక్ష్యంతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలి

**ఐటీడీఏ పీవో బి.రాహుల్**

*బూర్గంపాడు, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి:*

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఐటిడిఏ పీఓ బి.రాహుల్ అన్నారు.బుధవారం నాడు బూర్గంపాడు మండలం కృష్ణ సాగర్ గ్రామంలోని గురుకులం కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలోని డార్మెంటరీ, డైనింగ్ హాల్, వంట గదిని, పరిసరాలు, తరగతి గదులు, పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కళాశాలలో విద్యార్థులతో



ప్రత్యేకంగా సమావేశమై కళాశాలలో విద్యా బోధన సక్రమంగా జరుగుతున్నది లేనిది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.కళాశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం సమయానుకూలంగా పుష్టికరమైన భోజనం అందించడంతో పాటు ఉదయం సాయంత్రం ప్రత్యేకంగా తరగతులు నిర్వహించాలని సూచించారు.అనంతరం అధ్యాపకులు విద్యార్థులకు బోధిస్తున్న పాఠ్యాంశాలను ఆయన స్వయంగా పరిశీలించారు.చలికాలం వస్తున్నందున విషపూరితమైన క్రిమి కీటకాలు సంచరించే అవకాశం ఉందని పిల్లలు రాత్రిపూట ఎవరు బయటికి రాకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు అశోక్ కుమార్, విజయబాబు,హర్ష తదితరులు పాల్గొన్నారు.

## నాగినేని ప్రోలు గ్రామంలో విజయవంతమైన పశు వైద్య శిబిరం



*బూర్గంపాడు, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి:*

జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో గోపాలమిత్ర, (గర్భకోష వ్యాధి )చికిత్స శిబిరం సారపాక పశువైద్యశాల పరిధిలోగల నాగినేని పోలు రెడ్డిపాలెం. గ్రామం నందు మొరంపల్లి బంజర పశు వైద్యులు, సారపాక పశువైద్యులు డాక్టర్ బాలకృష్ణ.,డాక్టర్ రాజేందర్ ల పర్యవేక్షణలో బుధవారం ఏర్పాటు చేశారు .రైతులు శిబిరానికి మూడు తెల్ల పశువులు 30 గేదెలు తీసుకొచ్చారు వాటిని పశు వైద్యులు పరీక్ష చేసి అవసరమైన మందులు అందించారు. 25 దూడలకు నట్టల మందులు త్రాగించారు. కార్యక్రమానంతరం డాక్టర్ బాలకృష్ణ రైతులకు పాడి పశువుల పెంపకంలో మెలుకువలు, పశుగ్రాసాల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సూపర్వైజర్ లక్ష్మణ్ ,గోపాల మిత్రులు టి .గోవింద రెడ్డి (జాతీయ మానవ జంతు హక్కుల పరిరక్షణ సంస్థ ప్రతినిధి )నాగరాజు. కిరణ్ నాగేశ్వరరావు .వి ఏ వెంకన్న బాబు , రైతులు తది తరులు పాల్గొన్నారు.

## మూలమలుపు వద్ద అప్రమత్తంగా ఉండాలి: ఎస్సై గంజి స్వప్న



*చంద్రుగొండ, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి:*

మండలా పరిధిలోని మద్దుకూరు దామరచర్ల చంద్రగుండ తిప్పనపల్లి మూలమలుపు వద్ద వాహనదారులు అప్రమత్తంగా ఉంటూ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. అయ్యన్నపాలం మూలమలుపు వద్ద ప్రమాదాలు జరగకుండా పెట్రోలింగ్ కార్ హెడ్ కానిస్టేబుల్ చిత్రపటాలను ఉంచటం జరిగిందని రాత్రి వేళలో మూలమలుపు వద్దకు రాగానే పెట్రోలింగ్ కారు ఉన్నట్లుగా రేడియం స్టిక్కరింగ్ తో ఉండటంతో వాహనదారులు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తగా వేగాన్ని తగ్గించి వాహనాలు నడిపే అవకాశం ఉందని తెలిపారు. మండల కేంద్రంలోని పాత ఇనుప సామాను కొనే దుకాణం వద్దకు వెళ్లి ఎటువంటి అనుమతి లేని అక్రమ సొత్తును కొనవద్దని ఆదేశించారు. అనుమానితులు ఎవరైనా విలువైన దొంగిలించిన ఇనుప ,రాగి తదితర వస్తువులను తీసుకొచ్చినట్లుగా అనుమానం వస్తే స్టేషన్కు సమాచారం అందించాలని తెలిపారు.

# రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారాన్ని ఆపడం సంతోషకరం

**–పాల్వంచలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సంబురాలు**

*పాల్వంచ, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి:*

కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై 18500 కోట్ల రూపాయల భారాన్ని బలవంతంగా రుద్దే ప్రయత్నాన్ని ప్రధాన ప్రతిపక్షంగా బిఆర్ఎస్ పార్టీ ప్రజల తరపున ఈ ఆర్ సి ఎదుట ప్రజల గొంతుకను వినిపించి విద్యుత్ చార్జీల పెంపును నిలుపుదల చేసిన సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారక రామారావు, భద్రాద్రి జిల్లా పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు, కొత్తగూడెం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు వనమా వెంకటేశ్వరరావు ల పిలుపుమేరకు బుధవారం పాల్వంచ పట్టణ పార్టీ బిఆర్ఎస్ అధ్యక్షుడు మంతపురి రాజు గౌడ్, పాల్వంచ కో–ఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి కనకేష్ పటేల్ ల ఆధ్వర్యంలో పాల్వంచలోని అంబేద్కర్ సెంటర్ నందు విద్యుత్




చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపాలనే కాంగ్రెస్ ప్రభుత్వ కుటిల ప్రయత్నాన్ని బిఆర్ఎస్ పార్టీ నాయకత్వం విఫలం చేసి విజయం సాధించిన సందర్భంగా బిఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు మిఠాయిలు పంచి పండుగ చేసుకున్నారు. ఈ సందర్భంగా మంతపురి రాజు గౌడ్, కాంపెల్లి కనకేష్ పటేల్ లు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో నిత్యం కరెంటు కోతలతో సతమతమైన తెలంగాణ ప్రాంతాన్ని కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ తెచ్చుకున్న తర్వాత 2014 నుండి 2023 వరకు బిఆర్ఎస్ పార్టీ పరిపాలించిన తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో తెలంగాణలో నాణ్యమైన విద్యుత్తును నిరంతరంగా సరఫరా చేసి, రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్తును అందజేసి ఏ రోజు కూడా విద్యుత్ చార్జీలను పెంచలేదని, పది నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు 420 హామీలను అమలు చేయడం మరిచి తెలంగాణ రాష్ట్ర ప్రజలపై 18500 కోట్ల రూపాయల విద్యుత్ చార్జీల భారం మోపాలని చూడటంతో ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయినా బిఆర్ఎస్ పార్టీ నుండి ప్రజల తరపున కల్వకుంట్ల తారకరామారావు, జగదీశ్ రెడ్డి, మధుసూదనా చారి తదితరులు ఇ ఆర్ సి ఎదుట హాజరై ప్రజల గొంతుక వినిపించి విద్యుత్ చార్జీలు పెంచవద్దని తమ వాదనను తెలపడంతో ఈ ఆర్ సి విద్యుత్ చార్జీల పెంపుదలను నిలిపి వేసిందని, ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలపై ఇటువంటి పన్నుల భారాన్ని మోపకుండా వారు అధికారంలోకి రావడానికి ఇచ్చినటువంటి 6 గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలేరు సింధు తపస్వి, కొత్తచెరువు హర్షవర్ధన్, సంగ్లోత్ రంజిత్, మారు మూల కిరణ్, పూజాల ప్రసాద్, కాలేరు అఖిల్ మహర్షి, తోట లోహిత్ సాయి, ముత్తినేని గోకుల్, గండికోట సురేష్, ఆలీ, సాయి కిరణ్, భరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## దీపావళి శుభాకాంక్షలు : జిల్లా ఎస్పీ

*కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి:*



జిల్లా ప్రజలకు,పోలీస్ అధికారులకు సిబ్బందికి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్.ఈ దీపావళి పండుగ ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఈ సందర్భంగా ఎస్పీ మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. టపాసులు పేల్చే సమయంలో తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి కళ్యాణం




*చంద్రుగొండ, అక్టోబర్ 30, ప్రజా జ్యోతి:*

చంద్రుగొండ మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో బుధవారం శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించిన లక్ష్మీనారాయణ స్వామి కళ్యాణ మహోత్సవాన్ని పెద్ద ఎత్తున భక్తులు హాజరై వీక్షించారు. పలువురు పేటల పై కూర్చుని కళ్యాణాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఆర్యవైశ్య భక్త బృందం చేత శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

## దొంగల హల్ చల్

**గుండాలలో పలుచోట్ల చోరీ**




*గుండాల, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి*

గుండాల మండల కేంద్రంలో గుర్తుతెలియని దొంగలు అర్ధరాత్రి సమయంలో హల్చల్ చేసి పలుచోట్ల చోరీ చేశారు మంగళవారం రాత్రి గుండాల రామాలయం ఆలయంలో ఓ జ్యువెలరీ షాపులో దొంగతనానికి పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది గుండాల పోలీసుల కథనం ప్రకారం మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఆటోలో గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ఓ జ్యువలరీ షాప్ లో తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు రామాలయం ఉండి పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు గుండాల మండల కేంద్రానికి చెందిన మణికంఠ జ్యువలరీ షాప్ లో తాళాలు పగలగొట్టి షాప్ లో ఉన్న బంగారం వెండిని దొంగలించడంతో పాటు షాప్ లో ఉన్న పలు ధ్వంసం చేసి సీసీ కెమెరాలు పక్కకు తిప్పడం చేశారని గుండాల రామాలయంలో గోడల పై నుండి దూకి ఉండిని పగలగొట్టి దొంగలించినట్లు తెలిపారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.



# ఘనంగా అన్నదాన కార్యక్రమం



*బూర్గంపాడు, అక్టోబర్ 30, ప్రజా జ్యోతి:*

మండల పరిధిలోని మొరంపల్లి బంజరు గ్రామంలో అయ్యప్ప స్వామి దీక్ష స్వాములకు జక్కిరెడ్డి మల్లారెడ్డి ఇంటి వద్ద ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అయ్యప్ప స్వామి పటానికి దండ వేసి పూజలు నిర్వహించి భజనలు చేశారు. అనంతరం దీక్ష స్వాములకు అన్నదానం చేయటం జరిగింది. ఈ సందర్భంగా గురుస్వామి కందుకూరి నాగేంద్రం మాట్లాడుతూ మండల కాలంలో అయ్యప్ప మాల ధరించి 41 రోజులు దీక్షలు నిర్వహించి అనంతరం ఇరుముడి కట్టుకొని శబరిమల అయ్యప్ప స్వామి సన్నిధానానికి దీక్ష స్వాములు చేరుకొని ఇరుముడి అప్పజెప్పి దర్శించుకుంటారు. ఈ 41 రోజులలో అయ్యప్ప దీక్ష స్వాములు పూజలు, పడిపూజలు, అన్నదాన కార్యక్రమాలు, పీఠాలు నిర్వహించి నిత్యం అయ్యప్ప స్వామి పూజలు నిర్వహిస్తూ ఘనంగా కొలుస్తారు. గురుస్వామి ఆశీస్సులతో కొత్తగా మాలేసుకున్న కన్నె స్వాములు ఆశీస్సులు తీసుకొని చెప్పుతూ అయ్యప్పను కొలుస్తారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి దీక్ష స్వాములు గ్రామస్తులు పాల్గొన్నారు.

# దీపావళి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కోరం

*ఇల్లందు, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి:*



ఇల్లందు నియోజకవర్గ ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులకు బుధవారం ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. దీపావళి పండుగను ప్రజలు సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

# అధిక ధరలకు ఇసుక



*జూలూరుపాడు, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి*

మండల కేంద్రంలో కొందరు ఇసుకను వే బ్రిడ్జిలు అడ్డాలుగా చేసుకొని మూడు పూవులు ఆరు కాయలుగా వ్యాపారం చేస్తున్నారు, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో 1500 నుంచి 1600 వరకు విక్రఇస్తున్నారు. లారీలతో తీసుకొచ్చి ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టరాజ్యంగా ధరలను పెంచి అమ్ముతున్నారు ఇసుక కొనుగోలు చేయాలంటే సామాన్యులకు కష్టంగా మారింది 11 నుంచి 1200 రూపాయలు ఉన్న టన్ను ఇసుకను 15 నుంచి 1600 కు అమ్ముతూ రవాణా కాంటాలకు అదనంగా డబ్బులు వసూలు చేస్తూ విక్రయదారులకు చుక్కలు చూపిస్తున్నారు. ఇసుక అందుబాటులో ఉందని సంతోషించినా, ఇదే అదునుగా భావించి అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. నిజంగా వీరికి అనుమతులు ఉన్నాయా ఉంటే ఎంత ధరకు అమ్మాలని నిబంధనలు ఉన్నాయా అనే విషయంపై అధికారులు చొరవ తీసుకొని న్యాయం చేయాలని ఇసుక కొనుగోలు దారులుకోరుతున్నారు.

# డిగ్రీ కళాశాల ప్రగతికి పాటుపడదాం ఎమ్మెల్యే తెల్లం

*భద్రాచలం, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి:*

భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషిచేసి కళాశాల ప్రగతికి పాటుపడదామని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్ రావు అన్నారు. బుధవారం కళాశాలలో నిర్వహించిన ఒరియెంటేషన్, ఐటీసీ నోట్ బుక్స్ పంపిణీలో ఆయన పాల్గొని విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో టాయిలెట్స్ నిర్మాణానికి, లైబ్రరీ, లేబొరేటరీ, పరీక్షల స్ట్రాంగ్రూమ్ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని తెలిపారు. భద్రాచలం డిగ్రీ కళాశాలకు ఎంతో గుర్తింపు ఉందని, ఇక్కడ చదువుకునే విద్యార్థులు దేశ, విదేశాల్లో స్థిరపడిన విషయాన్ని గుర్తుచేశారు. కళాశాల ప్రగతి విషయం ప్రభుత్వంతో మాట్లాడి జిల్లా అధికార యంత్రాంగం దృష్టికి కూడా తీసుకువెళ్లి అత్యాధునికంగా రూపుదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జాస్మిట్లన్, ఐటీసీ ఏఓ చెంగల్రావు, వైస్ ప్రిన్సిపాల్ హవీలా, సీపీడీసీ సెక్రటరీ బూసిరెడ్డి శంకర్రెడ్డి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు కామేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి తోటమళ్ల బాలయోగి, ఉపాధ్యక్షులు సోముల గిరిప్రసాద్, సహకార్యదర్శి వెంకటరెడ్డి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




# మండలప్రజలకు అధికారులకు దీపావళి శుభాకాంక్షలు

**పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి మాజీ సొసైటీ చైర్మన్**

*బూర్గంపాడు, అక్టోబర్ 30 ,ప్రజాజ్యోతి:*



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపాడు మండలం ప్రజలకు మరియు అధికారులకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేసిన పోతురెడ్డి వెంకటేశ్వరరెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ దీపావళి పండగని సంతోషంగా జరుపుకోవాలని దీపావళి పండగకి లక్ష్మీ పూజ చేసుకుంటారని ఆ లక్ష్మీదేవి అందరిని అనుగ్రహించాలని కోరుకుంటున్నాం అన్నారు అదేవిధంగా పిల్లలు టపాసులు కాల్చేటప్పుడు తల్లిదండ్రులు దగ్గర ఉండాలన్నారు తగు జాగ్రత్తలు తీసుకొని పండగ సంతోషంగా జరుపుకోవాలని అన్నారు.

# అనారోగ్యంతో వద్ది రామసుబ్బమ్మ మృతి



*భద్రాచలం, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి:*

భద్రాచలంలో ప్రముఖ వైద్యులు జయభారతి, పవన్ కుమార్ ల మాతృమూర్తి వద్ది రామసుబ్బమ్మ (75) బుధవారం మృతిచెందారు. ఆమె గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా జయభారతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. రామసుబ్బమ్మ కుటుంబం వైద్యుల కుటుంబం కావడంతో ఆమె మృతి పట్ల భద్రాచలం పట్టణంలోని ప్రముఖ వైద్యులు, ఇతర వైద్యశాలల వైద్యులు పలువురు సంతాపం ప్రకటించారు.

# కె. ఓ. సి లో 42మంది కాంట్రాక్టు కార్మికులకు బోనస్ చెల్లించాలి.?

**బి.మదు ఎస్ సి కే ఎస్ రాష్ట్ర కార్యదర్శి**

*టేకులపల్లి, అక్టోబర్30, ప్రజాజ్యోతి:*

కె.ఓ.సి–2లోపని చేస్తున్న 42మంది కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్లో ఉన్నబోనస్ డబ్బులు వెంటనే చెల్లించాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మదు, భూ నిర్వాసితుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ , సీఐటీయూ నాయకులు ఎస్. ఏ నబి లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు,.బుధవారం నాడు పత్రికా ప్రకటన విడుదల చేశారు.దసరా పండుగ సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన బోనస్ డబ్బులు నేటికీ కార్మికులకు చేరకపోవడం శోచనీయమన్నారు.వెంటనే ఇల్లందు జీఎం చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు,ఈ కార్యక్రమంలో కార్మికులు బానోత్ వస్రం,పి.రాంబాబు,బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పంచాయతీ సెక్రటరీల ప్రొబేషనరీ పిరియడ్ తగ్గించాలి



*చంద్రుగొండ, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి:*

పంచాయతీ కార్యదర్శుల ప్రొబేషన్ పిరియడ్ నాలుగు సంవత్సరాల నుండి రెండు సంవత్సరాలకే కుదించాలని ఆ సర్వీస్‌ను పరిగణలోకి తీసుకోవాలని కోరుతూ బుధవారం తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ అధ్యక్షులు పి మధుసూదన్ రెడ్డి ప్రధాన కార్యదర్శి ఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి ని రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ లోకేష్ కుమార్ ని పంచాయతీరాజ్ కమిషనర్ అనిత రామచంద్రన్ కలిసి వినతి పత్రాలు హైదరాబాదులో వారి కార్యాలయాలలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శుల సమస్యలు గ్రామాలను గ్రేడులుగా గుర్తించి కేడర్ స్ట్రెంత్ నిర్ణయించాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సర్వీస్ కాలం 12 4 2019 నుండి సర్వీస్ కౌంట్ చేస్తూ ప్రొవైషనరి పీరియడ్ నాలుగు సంవత్సరాల నుండి రెండు సంవత్సరాలకు కుదించాలని డిమాండ్ చేశారు. ఓ పి ఎస్ లుగా పనిచేయుచున్న వారిని జేపీఎస్ లుగా గుర్తించి ఆ వ్యవస్థను రద్దు చేయాలన్నారు. మెదక్ జిల్లాలో పనిచేయుచున్న పంచాయతీ కార్యదర్శులకు ప్రమోషన్ కల్పించాలని మొత్తం 20 డిమాండ్లతో వినతి పత్రాలు అందించినట్లు తెలిపారు. దీనికి అధికారులు సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు టి పి ఎస్ ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సతీష్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అరుణ్ కుమార్, కవిత, లక్ష్మీనారాయణ, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.